Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143







Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 230 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :230 | ఆదివారం 17 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4


## ట్రంప్- పుతిన్ ప్రయత్నాలు భేష్..



- 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధినేత పుతిన్ ల మధ్య అలాస్కాలో జరిగిన సమావేశాన్ని స్వాగతిస్తున్నాం
- శాంతి సాధన దిశగా వారి ప్రయత్నాలు ఎంతో ప్రశంసనీయం
- ఈ భేటీలో సాధించిన పురోగతిని అభినందిస్తున్నాం
- చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాలి

## పులివెందుల, ఒంటిమిట్ట పోలింగ్ సమాచారం ఇవ్వండి


రాష్ట్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ వినతి పత్రాలు

మొత్తం ఏడు అంశాలకు సంబంధించిన వివరాలు కావాలంటూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేస్తూ, అత్యంత దారుణంగా, ఏకపక్షంగా నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తోంది. ఆ దిశలోనే ఆ రెండు ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి.. "పోలింగ్ స్టేషన్లు, ఆయా ప్రాంగణాల సీసీ కెమెరా ఫుటేజ్, పలు ఘటనలకు సంబంధించిన వీడియో కవరేజ్, పోలింగ్‌కు సంబంధించిన వెబ్‌కాస్టింగ్, ఆ రోజు పోలింగ్ బూత్‌ల్లో కూర్చున్న ఏజెంట్ల పేర్ల జాబితా.. ..పోలింగ్ ఆఫీసర్ (పీఓ) డైరీ, ఫామ్–12. - మిగతా3లో



# 20 నెలలు.. 20వేల కోట్లు

ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అప్పులు చేస్తున్నారని గగ్గోలు

మనదేశంలో ప్రతి రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య నిత్యం ఇలాంటి గోల జరుగుతూనే ఉంటుంది.

అప్పుల వల్ల తెలంగాణ రాష్ట్రం ఆగమవుతుందనే పిలాసఫీ ఆయన నోటి వెంట నుంచి వస్తోంది

సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ కేటీఆర్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేస్తుందనే మాట వినిపిస్తోంది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

అధికారంలో ఉన్న పార్టీ అభివృద్ధి చేస్తున్నామని చెబుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అప్పులు చేస్తున్నారని గగ్గోలు పెడుతుంది. మనదేశంలో ప్రతి రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య నిత్యం ఇలాంటి గోల జరుగుతూనే ఉంటుంది. దీనికి తెలంగాణ రాష్ట్రం మినహాయింపు కాదు. తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసింది. ఆ అప్పుల మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఖర్చు చేసినట్టు అప్పట్లో కేటీఆర్ సెలవిచ్చారు. ఆస్తుల కల్పన కోసమే తాము అప్పులు చేస్తున్నట్టు కేటీఆర్ వ్యాఖ్యానించారు. కానీ ఇప్పుడు కేటీఆర్ ప్రతిపక్ష పార్టీలోకి మారిపోవడంతో.. అకస్మాత్తుగా ఆయనకు అప్పులు అంటే ఒక బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తోంది. అప్పులు చేయకూడదని.. అప్పుల వల్ల తెలంగాణ రాష్ట్రం ఆగమవుతుందనే పిలాసఫీ ఆయన నోటి వెంట నుంచి వస్తోంది. సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ కేటీఆర్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేస్తుందనే మాట వినిపిస్తోంది.ఇక అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి నాయకులు చేస్తున్న అప్పులపై వ్యతిరేక స్వరం వినిపించారు. నిండు శాసనసభలో భారత రాష్ట్ర సమితి నాయకులను విమర్శించారు. అయితే నాడు అప్పును తప్పు అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. ఇప్పుడు అదే అప్పును తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పడం విశేషం.. అంతేకాదు భారత రాష్ట్ర సమితి చేసిన అప్పులను తాము తీర్చుతున్నామంటూ వివరించడం గమనార్హం. అటు భారత రాష్ట్ర సమితి కూడా కాంగ్రెస్ పార్టీ - మిగతా3లో




## ఎన్నికల సంఘం ప్రెస్ మీట్

- రాహుల్‌గాంధీ ఆరోపణలకు సమాధానం ఇచ్చే ఛాన్స్..!
- ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నేషనల్ మీడియా సెంటర్‌లో ప్రెస్‌మీట్
- అదేవిధంగా తాజా రాజకీయ పరిణామాలపై కూడా ఈసీ బ్రీఫింగ్ ఇవ్వనుంది



## బిహార్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్..

- రాహుల్ గాంధీ ఓటు అధికార్ యాత్ర..!
- రాహుల్ 16 రోజుల పాటు 24 జిల్లాల్లోని 118 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన
- రూ.1,300 కిలోమీటర్ల పొడవైన 16 రోజుల ప్రయాణం బీహార్‌లోని దాదాపు 25 జిల్లాల గుండా సాగనున్నది.

# మళ్లీ భారీ వర్షాలు..

## ప్రజలకు కీలక సూచనలు



- బంగాళాఖాతంలో మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం
- దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం
- అల్పపీడన ప్రభావంతో రానున్న మూడ్రోజులపాటు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఇక రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. భారత వాతావరణ శాఖ సూచన మేరకు దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని చెప్పింది. అల్పపీడన ప్రభావంతో రానున్న మూడ్రోజులపాటు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. ఇక రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ. ఈ నేపథ్యంలో మంగళవారం వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచించింది. మరోవైపు ఈదురు గాలులతోపాటు భారీ వర్షాల నేపథ్యంలో చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండవద్దని ప్రజలను హెచ్చరించింది. అదే విధంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఇక అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం - మిగతా3లో



## ఉచిత బస్సు కేవలం ప్రయాణం కాదు

- ఉచిత బస్సు టికెట్ అనేది నమ్మకానికి నిదర్శనం... స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక.
- ఇది ప్రయాణం కాదు ఓ కదలిక, స్వేచ్ఛాయుత, సమాన అవకాశం.
- రాష్ట్రంలో సుమారు 2.62 కోట్ల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా లాభం చేకూరనుంది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళల కోసం కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని కానుకగా ప్రకటించింది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఈ పథకాన్ని - మిగతా3లో

# ప్రభుత్వ ఆసుపత్రి ఫిర్యాదుల పెట్టి






**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 16:**
శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణా రెడ్డి సతీమణి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ నేడు ఫిర్యాదుల పెట్టెను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి అభివృద్ధి పరిచి ,ఇక్కడ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలతో పాటు మెరుగైన వసతులు కల్పించే విధంగా వారికి నేడు ఈ ఆసుపత్రి నందు ఫిర్యాదుల పెట్టే ఏర్పాటు చేశామని. ఇక్కడికి వచ్చి రోగులకు ఆస్పత్రి సిబ్బంది వల్ల కానీ , వైద్య సౌకర్యాలు అందించడంలో నిర్లక్ష్యం ఉన్న, ఇక ఎటువంటి సమస్యలు ఉన్న ఈ ఫిర్యాదు పెట్టెలో ఫిర్యాదు పత్రం రాసి ఈ ఫిర్యాదు పెట్టినందు వేస్తే. ఈ ఫిర్యాదులను హాస్పిటల్ కమిటీ చైర్మన్ స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వాటిని ప్రతి వారం పరిశీలించి. ఈ ఫిర్యాదు పెట్టలు వచ్చిన సమస్యలు పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపడతామని. తద్వారా రోగాలకు మెరుగైన వైద్యంతో పాటు మెరుగైన సేవలు కూడా లభిస్తాయని . కాబట్టి ఈ సదవకాశాన్ని ఈ ఆసుపత్రికి వచ్చే రోగులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఈ ఆస్పత్రి నందు మెరుగైన వైద్య పరికరాలు ఉన్నాయని ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన ఈ ఆసుపత్రి నందు చికిత్స తీసుకోవచ్చని ఎక్రే ,ఈసీజీ ,ఇంకా మంచి మంచి వైద్యపరికరాలు. ఈ ఆసుపత్రి నందు ఉన్నాయని ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి మెరుగైన వైద్యంతో పాటు మెరుగైన సేవలు పొందవలసిందిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యులు, గరికపాటి రమేష్, వినయ్, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు..అందరివాడు గౌతు లచ్చన్న

**మొట్టమొదట బీసీ గణనకు శ్రీకరం చుట్టిన మహోన్నత వ్యక్తి**
**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్**
**సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం**
**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**
**వచ్చే ఏడాది నాటికి ఇరువారంలో సర్దార్ గౌతు లచ్చన్న పేరుతో కమ్యూనిటీ హాల్ ఎన్ని ఇస్తామన్న ప్రజాప్రతినిధులు**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఆగస్టు 16:**
స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశా జ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆధునిక యుగానికి స్ఫూర్తిదాయకమని, ఆ మహోన్నత వ్యక్తి అందరు వాడని.. చిత్తూరుపార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ కొనియాడారు. సర్దార్ గౌతులచ్చన్న 116వ జయంతి వేడుకలను శనివారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ముఖ్య అతిథిగా హాజరుకాగా.., చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్..,చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్ర పటానికి పుష్పాలు సమర్పించారు. అలాగే ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. బీసీ కులాలను మొట్టమొదట గణన చేసిన వ్యక్తిసర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. 1909 ఆగస్టు 16న అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ, శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారనీ.,.చిన్ననాటి నుంచే సామాజిక చైతన్యం కలిగి స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొనే వారని తెలియజేశారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, ఇతర ప్రధాన పోరాటాలలో కూడా భాగస్వా మిమయ్యారని,.. బెర్హంపూర్, రాజ మండ్రి జైళ్లలో కఠిన కారాగారవాసం తో పాటు అనేక సార్లు జైలు జీవితం అనుభవించారనీ గుర్తుచేశారు. ఎమ్మె ల్యేగా, పార్లమెంట్ సభ్యులుగా ప్రజల కు సేవలందించి ప్రజల హృదయాలలో జరగని ముద్ర వేశారని తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న చూపిన మార్గం, చేసిన త్యాగం, సాధించిన విజయాలు శనివారం రోజు కూడా సమాజానికి దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయన్నారు. చిత్తూరు నగరంలోని ఇరువారంలో వచ్చే సంవత్సరం లోపు కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మస్తామని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. స్వాతం త్ర్యోద్యమం,జమీందారీ వ్యతిరేక పోరా టం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. సర్దార్ గౌతు లచ్చన్న చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని యువత తమ జీవితాలలో ఆచరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి వరుసలో ముందు ఉండాలని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కోరి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బలహీనవర్గాలకి అనేక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో ప్రగతి పదంలో ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆముద, మొదలియార్ అధ్యక్షులు త్యాగరాజన్, సి ఆర్ రాజన్, బీసీ సంక్షేమ అధికారులు రుబ్బాని, బీసీ లీడర్లు, అంతకు మునుపుసర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి ప్రముఖులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# తిరంగా ర్యాలీలు, ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాలు కార్యక్రమం విజయవంతం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్16:**
శ్రీకాళహస్తి నరేంద్ర మోదీ సూచనలుతో 15న పంద్రాగస్తు 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను గత వారం రోజులు నుంచి బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీ కోలా ఆనంద్ సహాయ సహకారాలతో తిరుపతి జిల్లాలోని 47 మండలాల్లో తిరంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగినది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి తిరుపతి జిల్లా నందు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు పేరుతో ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాలు ఎగురవేసి వందన సమర్పణ చేయడం జరిగింది. ప్రతి మండలాల పరిధిలో తిరంగా ర్యాలీలు అంగరంగ వైభవంగా అంబరాన్నితాకే విధంగా మువ్వన్నెల జెండాలు చేత పట్టుకొని పురవీధుల్లో త్రివర్ణమయంతో కోలాహలంగా ర్యాలీలు నిర్వహించి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఘనంగా జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో విజయవంతం కోసం కృషి చేసిన తిరుపతి జిల్లా బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్, ముని సుబ్రమణ్యం, అజయ్, ఎస్ ఎస్ నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ప్రశాంతి రాజు, ప్రసాద్ చౌదరిలతో పాటు బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభి లాషు లకు పేరుపేరునా ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల కమిటీ జిల్లా కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీకోటలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 16:**
వీకోట మండలంలోని అన్ని గ్రామాల నుండి అనేకమంది యాదవ కులస్తులు, రాధాకృష్ణ గోపికల వేషాలతో భారీగా జనం తరలివచ్చినారు, మొదటగా రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నందు శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని స్వామివార్లకు అభిషేకాలు విశేష పూజలు చేయించి అనంతరం గోపికల వేషధారణలో మహిళలు కోలాటములు ఆడుతూ, శ్రీకృష్ణుని వేషాధారంలో పురుషులు పిల్లన గ్రోవెలు చేతబట్టి వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు చేరుకొని అక్కడి నుండి మేళ తాళాల డప్పుల వాయిద్యాల మధ్య ఊరేగింపుగా బయలు దేరినారు. ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా వృషభాలంకరం కలిగిన పెద్ద వృషభము ఆ వృషభం వెనకాల శ్రీకృష్ణుని చిత్రపటాన్ని భారీగా అలంకరణ చేసిన ఊరేగింపు వాహనము కదలగా.... ముందుభాగాన మహిళల కోలాటం ఆడుతూ వేణుగోపాలస్వామి గుడి వీధి నుండి బయలుదేరి వైయస్సార్ సర్కిల్ వద్ద వరకు వెళ్లి అక్కడి నుండి బజారు మార్గాన అంబేద్కర్ సర్కిల్ వరకు వచ్చి, అనంతరం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణుని ఊరేగింపు వాస్తవాన్ని ముగింపు పలికినారు. ఈ కార్యక్రమానికి మండలములోని యాదవ కులస్తులతో పాటు శ్రీకృష్ణ భగవానుని భక్తులు అత్యధికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఎదురుగా కాకుండా వీకోట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్, పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకొని శ్రీకృష్ణుని ఊరేగింపు సజావుగా జరిపేందుకు మరియు వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తమ సిబ్బందితో సహాయ సహకా రాలు అందించినారు. ఈ కార్యక్రమంలో ఏ రమేష్ బాబు, వై. జగన్మోహన్ రెడ్డి ఇంద్రేష్ పిఎం శ్రీరామప్ప తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా ఆడికృత్తిక, కృష్ణాష్టమి వేడుకలు


## టీఎస్ అగ్రహారంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు16:**
పలమనేర్‌లో ఆడికృత్తిక, కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పలమనేరు మున్సిపల్ పరిధిలోని టీఎస్ అగ్రహారంలో వెలసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పలమనేరు శాసనసభ్యుల అమరనాథ రెడ్డి స్థానిక టిడిపి నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజలలో పాల్గొని స్వామివారిని వేడుకున్నారు. సకాలంలో వర్షాలు విరివిగా కురిసి రైతులు మంచి పంటలను పండించాలని అదేవిధంగా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండేలా చూడాలని ఆ స్వామి వారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఆలయ మర్యాదలతో సన్మా నించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఇక ఆలయం వద్ద టీడీపీ నేతల ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కుట్టీ, గిరిబాబు, సుబ్ర హ్మణ్యం గౌడ్, శ్రీధర్, ఖాజా, నాగరాజు, అమరనాథ రెడ్డి, మదన్, రూపేష్,జగదీష్, హరీష్, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉన్నత లక్షణాలు పెంపొందుతాయి

## జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్16:**
శ్రీకాళహస్తి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడంవల్ల విద్యార్థులకు ఉన్నత విలువలు పెంపొందుతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు అన్నారు. స్థానిక బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇటీవల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులైన స్కౌట్స్ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుండే క్రమశిక్షణ, సేవా నిరతి, దేశభక్తి వంటి ఉత్తమ లక్షణాలు అలవరిచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్ వంటి సర్టిఫికెట్స్ పొందిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలకు 0.05 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అనంతర ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్ విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి, తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో ఉత్తీర్ణుల వడానికి కృషి చేసిన స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె. రఫీ, మునిరాజ, ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ రావాలని పూజలు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 16:**
అన్నమయ్యజిల్లా పీలేరు ఎంపీ మిథున్ రెడ్డి త్వరగాబెయిల్ రావాలనిఅంకాలమ్మ దేవస్థానంలో వైఎస్ఆర్సిపి నాయకులు 301 కొబ్బరికాయలు కొట్టారు మిథున్ రెడ్డి త్వరగా రావాలని అమ్మ వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం అధికారప్రతినిధి సుంకర చక్రధర్ విక్టరీ వెంకటరమణారెడ్డి, ఉదయ్ ఆనంద్, నారే, వెంకటరమణారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, షాకీర్, మునీర్,వెంకటరమణ, విపి రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణా మందిరంలో పుష్ప యాగం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్16:**
శ్రీకాళహస్తి చెంచులక్ష్మీ కాలనీలో వెలిసి ఉన్న శ్రీ కృష్ణా మందిరంలో పుష్ప యాగం శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలు ఏపీఎన్జీఓఎస్ శ్రీ కాళహస్తి తాలూకా అధ్యక్షుడు చల్లా. చెంచురత్నం యాదవ్ శ్యామల దంపతులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదోయుక్తం పుష్పయాగం చేపట్టారు. ఆలయంలో శ్రీ కృష్ణాస్వామి మూల విరాట్‌కు విశేష అలంకారం చేసి పూజలు జరిపారు. వివిధ రకాల పుష్పాలుతో అర్చనలు చేస్తూ వేద మంత్రోచ్ఛరణల నడుమ మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణలు చేస్తూ పుష్ప యాగం నిర్వహించారు. సుమారు టన్ను పుష్పాలుతో పుష్ప యాగం నిర్వహించారు. భక్తులు పుష్పయాగంను తిలకించి ఆధ్యాత్మిక తన్మయంతో పులకిస్తూ గోవింద నామ స్మరణలు చేస్తూ భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లి పరవశించారు.

# అంగరంగ వైభవంగా ఆడికృత్తిక మహోత్సవాలు





**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ఆగష్టు16:**
రేణిగుంటమండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీబాలసుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శనివారం ఆడికృత్తిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మూడు రోజులపాటు జరిగే మహోత్సవాలలో భాగంగా 14 వ తేదీ గురువారం ధ్వజారోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి మూలవిరాట్‌కు తెల్లవారుజామున అర్చకులు సుగంధ ద్రవ్యాలు,పంచామృత అభిషేకా లు నిర్వహించి స్వామివారిని శోభాయ మానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం సుమారువెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఉంజులసేవ నిర్వహించి,మేళ తాళాలు మంగళవాయిద్యాలు బాణాసంచాపేలుళ్ల మధ్యస్వామివారిన గ్రామంలో ఊరేగించారు. ఇంటింట భక్తులు కాయ కర్పూరం సమర్పించి స్వామివారిని కొలిచారు. ఈ సందర్భంగా ఉత్సవనిర్వాహకులు మాట్లాడుతూ ఎంతో ప్రాచీణ్యం కలిగిన స్వామి వారిని భక్తితో దర్శించి కోరితే మండలం రోజుల్లోనే వారి కోరిక నెరవేరుతుందనేది భక్తుల ప్రగాఢ నమ్మకమని అన్నారు. గ్రామంనుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామం నుంచి కూడా స్వామివారి దర్శనానికి భక్తులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి మంగళవారం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారికి మహోత్సవాలకు నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన రాజనాల బండ తిరునాళ్లు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు16:**
సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండపై శనివారం తిరునాళ్లు ప్రారంభమయ్యాయి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపైన ఉదయం 6 గంటల నుండి స్వామివారికి అభిషేకము రాజనాల బండ వద్ద వీరాంజనేయస్వామి వారికి అభిషేకము నిర్వహించారు. ఉదయం నుంచి కొండపై సాయంత్రం వరకు భక్తులు నడిచి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి అఖండ జ్యోతిని వెలిగించారు, రాత్రి శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే రాజనాల బండ పై అన్న మయ్య సంకీర్తనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రాజనాల బండపై పండుగ వాతావరణం నెలకునింది.

# ఆడికృత్తిక వచ్చే భక్తులకు అన్నదానం, రూపేష్

**కార్వేటినగరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 16:**



కార్వేటినగరం మండలంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృతిక మహోత్సవం సందర్భంగా గంగాధర్ నెల్లూరు నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో టిడిపి యువనాయకుడు రూపేష్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆడి కృత్తికసందర్భంగా సుబ్రమణ్య స్వామికి కావిడి చెల్లించే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని రూపేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీ ఆన్ రికార్డ్

**విజయవాడ,**

పులివెందులలో జెడ్పీ ఎన్నికల్లో ఘోర పరాభవానికి కుప్పంలో లింక్ ఉందా..అప్పటి అత్యుత్సాహమే ఇప్పటి ఓటమికి కారణమైందా అన్నవిశ్లేష ణలు వస్తున్నాయి. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పంను కొల్లగొట్టి.. వై నాట్ కుప్పం అంటూ చేసిన అతి చర్యలవల్లే ఇప్పుడు జగన్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం అంటోంది. వై నాట్ 175 అంటూ అప్పట్లో జగన్ కుప్పం ను కూడా కలుపుకునే అన్నారు. దానికి ప్రతిగా చంద్రబాబు వైనాట్ పులివెందుల అంటూ సవాల్ చేశారు.అప్పట్లో జగన్ అయినా.. చంద్రబాబు అయినా కూడా ముఖాముఖీగా వాళ్ల నియోజకవర్గాలను కూడా ఓడిస్తామని సవాల్ చేశారు. అది జరగలేదు కానీ.. ఏడాది తర్వాత పులివెందులలో వైసీపీని టీడీపీ చావు దెబ్బ కొట్టింది. వైఎస్ కుటుంబానికి ఓటమంటే తెలియని పులివెందులలో అదీ ఆ మండలంలో వైసీపీని డిపాజిట్ కూడా రాకుండా ఓడించడం వెనుక చాలా సంగతే ఉంది. క్యాడర్ కష్టపడిందా.. అధికారంతో అక్రమాలు చేసిందా.. ప్రత్యర్థులను భయపెట్టిందా.. లేక జగన్‌పైనే వ్యతిరేకత వచ్చిందా.. ఇలా ఎన్నిరకాల వాదనలున్నా.. సరే మొత్తానికి ఆన్ రికార్డ్ టీడీపీ అక్కడ గెలిచింది. దీనికి కారణం కుప్పం.. సాధారణంగా ముఖ్యమంత్రి అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలు అంత దృష్టి పెట్టవ్.. వాళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేత నియోజకవర్గంలో రాజకీయ ఫిరాయింపులని ప్రోత్సహించడం లాంటివి కూడా చేయరు.. అదంతా వైఎస్ చంద్రబాబు జమానా వరకూ సాగింది. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 2017లో కడప జిల్లాలో బీటెక్ రవిని స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ గెలిపించుకోగలిగింది. చంద్రబాబు తన జిల్లాలో రాజకీయం చేస్తే.. జగన్ ఏకంగా ఆయన నియోజకవర్గంలోనే చేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పం మునిసిపాలిటీతో పాటు.. నియోజకవర్గంలోని అన్ని జెడ్పీటీసీలను.. ఎంపీటీసీలను కూడా వైసీపీ కైవసం చేసుకుంది.పులివెందులో టీడీపీ దౌర్జన్యాలు చేసిందని.. ఓటర్లను బయటకు రానివ్వకుండా రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. మరి ఆ రోజు.. కుప్పంలో జరిగింది కూడా అదే. కుప్పం మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. జర్నలిస్టులను కూడా కొట్టారు. ఆ నియోజకవర్గం మొత్తం టీడీపీ బయటకు రాకుండానే చేశారు.కుప్పంలో చంద్రబాబు అప్పటికే 7సార్లు ఎమ్మెల్యే. ప్రత్యర్థి పార్టీకి అంతగా పట్టు లేదు. కానీ 2021లో కుప్పం పరిధిలోని 89 పంచాయతీల్లో వైసీపీ 74చోట్ల గెలిచింది. నియోజకవర్గంలోని 4 మండలాలు వైసీపీ పరం అయ్యాయి. ఇక నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో అయితే.. ఏకంగా 17వేలు, 16వేలు, 11 వేల చొప్పున మెజార్టీలు వచ్చాయి. 68 ఎంపీటీసీ స్థానాల్లో 63 వైసీపీవే..! పెద్దిరెడ్డి కుప్పంలోనే క్యాంప్ వేసి మరీ ఎన్నికల్లో ఈ రిజల్ట్ తెప్పించారు. "చంద్రబాబు ఇలాకాలో 90శాతానికి పైగా సీట్లు అప్పట్లో వైసీపీ తన ఖాతాలో వేసుకుంది. మరిప్పుడు ఒక్క చోట ఓడిపోతేనే గగ్గోలు పెడుతున్నారు ఎందుకు" అంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కుప్పంలో గెలుపొందిన వైసీపీ అక్కడితో ఆగలేదు.. చాలా అత్యుత్సాహం ప్రదర్శించింది. చంద్రబాబు ఓడిపోయాడని.. కూలిపోయాడని... ప్రచారం ప్రారంభించింది. జెడ్పీ ఓట్ల లెక్కల ప్రకారం చంద్రబాబు కంటే 62వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పింది. దీనికి కుప్పం మునిసిపాలిటీమెజార్టీ అదనం.. అది కూడా కలుపుకుంటే 75వేల ఓట్లు మెజార్టీ...వైనాట్ 175 స్లోగన్‌కు అదే బీజం కూడా..! అప్పట్లో నియోజకవర్గం మొత్తం కొల్లగొట్టిన వైసీపీ ఇప్పుడు రెండు జెడ్పీటీసీ ఓటములను జీర్ణించుకోలేకపోయింది.వైసీపీ లెక్క ప్రకారం చంద్రబాబుకు అప్పటికే ఉన్న మెజార్టీని దాటుకుని 75వేలు ఓట్లు పెరిగాయంటే.. దాదాపు లక్ష ఓట్లు టర్న్ అయినట్లు. కానీ 2024 రిజల్ట్ మాత్రం వేరు. చంద్రబాబు తనకు అంతకు ముందు వచ్చిన దానికంటే.. 18వేలు పెంచుకున్నారు. మరి ఈ లక్ష ఓట్లు ఏమయ్యాయి. ఇక జగన్ తనకు ఉన్న 90వేల మెజార్టీ నుంచి 60వేలకు పడిపోయారు. దీనిని బట్టే పులివెందులలో జగన్ ప్రాభవం తగ్గినట్లు కనిపిస్తోంది. అప్పట్లో కుప్పం ఒక్కదానితోనే ఆగలేదు.. జిల్లా మొత్తంలో 65 జెడ్పీ స్థానాలుంటే.. 65 వైసీపీనే గెలిచింది. ఇందులో ఏకంగా 33 స్థానాలు ఏకగ్రీవాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఎంజాయ్ చేసిన వైసీపీ ఇప్పుడు రెండు ఓటములను తీసుకోలేకపోతోంది.కుప్పంలో జరిగిన హంగామాను తెలుగుదేశం చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే పులివెందులను టార్గెట్ చేసింది. జగన్ నేరుగా ఓడించడం సాధ్యం కాదు అని తెలిసి.. అక్కడ దెబ్బకొట్టడానికి తగిన అవకాశం కోసం చూసింది. మరో ఏడాదిలోనే స్థానిక ఎన్నికలున్నాయి. మామూలుగానే టీడీపీ స్థానిక ఎన్నికలను వేగంగా పెట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక పెట్టడం.. అది కూడా పులివెందులలో పెట్టడం అంటే ఓ రకంగా రిస్క్ తీసుకున్నట్లు అర్థం. లోకేష్ నేరుగా ఇన్వాల్వ్ అయి... పులివెందుల ఎన్నికకు చొరవ చూపినట్లు తెలుస్తోంది. కచ్చితంగా గెలిచి తీరాలన్న టాస్క్ ఇచ్చిన తర్వాత.. గెలిచి తీరతామన్న నమ్మకంతోనే ముందుకెళ్లారు. జగన్‌ను మొన్నటి ఎన్నికల్లో ఎదుర్కొన్న బీటెక్‌రవి భార్య లతా రెడ్డిని రంగంలోకి దింపారు. గురి చూసి వైఎస్ కుటుంబం కుంభస్థలాన్ని కొట్టారు.కుప్పంలో తెలుగుదేశం నాలుగు చోట్ల కలిపి 20వేల ఓట్లు అయినా సాధించింది. కానీ.. పులివెందులలో వైఎస్సార్సీపీకి డిపాజిట్ రాలేదు. 7వేలకు పైగా ఓట్లు పోలైతే... 683 ఓట్లు మాత్రమే వచ్చాయి. తెలుగుదేశం అసలు ఓటర్లను ఇళ్లనుంచి బయటకు రానివ్వకుండా మొత్తం రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపణ. చాలా చోట్ల దొంగ ఓట్లు వేసిన ఆధారాలను ఆ పార్టీ అధినేత బయటపెట్టారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఇవే తరహా ఆరోపణలు కుప్పం ఎలక్షన్‌లోన వచ్చాయి. మేం రిగ్గింగ్ చేసుకుంటే.. "ఓటింగ్ 74శాతమే ఎందుకవుతుంది.. 90శాతం చేసుకునే వాళ్లం కదా.." అని టీడీపీ అంటోంది.తెలుగుదేశం దూకుడుగా వెళ్లినట్లు కనిపిస్తున్నా.. కొన్ని చోట్ల వైసీపీ ఓటర్లు కూడా ఓటింగ్‌కు నిరాసక్తత చూపారు. కొన్నేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్ అవినాష్‌రెడ్డి హవానే సాగుతోంది. జగన్ సొంత నియోజకవర్గంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వైఎస్ అవినాష్‌పై కోపం ఉన్న వాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా చేస్తే అయినా జగన్‌కు విషయం అర్థం అవుతుంది అనుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. సరే ఏదైతే ఏంటి.. మొత్తానికి మొట్టమొదటి సారి తెలుగుదేశం పులివెందులలో జెండా ఎగరేస్తే.. 45ఏళ్ల తర్వాత వైఎస్ కుటుంబం ఓటమిని ఎదుర్కొంది. వై నాట్ కుప్పం అంటూ ఆరోజు.. చేసిన దానికి వై నాట్ పులివెందుల అంటూ వీళ్లు బదులిచ్చారు.

- మిగతా 3లో

## ఉచిత బస్సు కేవలం ప్రయాణం కాదు

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించడం గర్వంగా ఉందని మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎక్స్ లో చేసిన పోస్టులో ఇలా రాసుకొచ్చారు. ఉచిత బస్సు టికెట్ అనేది నమ్మకానికి నిదర్శనం... స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక. ఇది ప్రయాణం కాదు ఓ కదలిక, స్వేచ్ఛాయుత, సమాన అవకాశం. స్త్రీ శక్తి ద్వారా ఏపీ ప్రభుత్వం మహిళల సాధికారితకు పట్టంకట్టింది. సోదరసోదరీమణులారా...ఈ ప్రయాణాన్ని వేడుకగా నిర్వహించుకుందాం. మీ ఫ్రీ బస్సు టికెట్ తో సెల్ఫీ దిగి ఈ ప్రపంచానికి సాధికారిత అంటే ఎలా ఉంటుందో చూపించండి అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో సుమారు 2.62 కోట్ల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా లాభం చేకూరనుంది. ఈ పథకం కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.162 కోట్లు, సంవత్సరానికి దాదాపు రూ.1,942 కోట్లు ఖర్చు చేస్తోంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి అన్ని బస్సుల్లో మహిళలు ఎక్కడికైనా, ఎంతదూరమైనా రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించవచ్చు. ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ 11,449 బస్సులను నడుపుతుండగా, వాటిలో 8,458 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అంటే సుమారు 74 శాతం బస్సుల్లో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు ఎలాంటి ఛార్జీలు లేకుండా వెళ్ళే వీలు ఉంటుంది.

## పులివెందుల, ఒంటిమిట్ట పోలింగ్ సమాచారం ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

ఫామ్-32 ఈ ఏడు అంశాల పూర్తి వివరాలు, సమాచారం ఇవ్వాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘాని(ఎస్ఈసీ)కి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి వేర్వేరుగా రెండు (పులివెందుల, ఒంటిమిట్ట) వినతిపత్రాలు పంపించారు. వీలైనంత త్వరగా ఆ వివరాలు, పూర్తి సమాచారం ఇవ్వాలి" అని లేఖల్లో లేళ్ల అప్పిరెడ్డి విజ్ఞప్తి చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రకటించిన నాటి నుంచి అధికార పక్షం చేసిన అరాచకాలు, వారికి వత్తాసు పలుకుతూ పోలీసులు వ్యవహరించిన తీరుపై వైఎస్సార్‌సీపీ ప్రత్యక్షంగానూ, లేఖల ద్వారానూ మొత్తం 35 పర్యాయాలు ఎస్ఈసీకి వినతిపత్రాలు అందజేసింది. ఫిర్యాదు చేసింది. ఎన్నికలకు వారం రోజుల ముందు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, పార్టీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. దానిపై ఆధారాలతో సహా ఎస్ఈసీకి వైయస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. అయినా ఎస్ఈసీ పట్టించుకోలేదు. ఇక ఎన్నికల రోజున ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, తెల్లవారుజాము నుంచే అన్ని పోలింగ్ బూత్‌లు స్వాధీనం చేసుకున్న అధికార పక్షం నాయకులు, కార్యకర్తలు.. చివరకు ఏ పోలింగ్ బూత్‌లోకి వైఎస్సార్‌పీపీ ఏజెంట్లను అడుగు కూడా పెట్టనీయలేదు. వారి నుంచి ఏజెంట్ అధీకృత ఫామ్స్ లాగేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులెవ్వరూ ఓటు వేయకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. చివరకు పులివెందులలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంతరెడ్డిని కూడా ఓటు వేయనీయలేదు. ఆయన్ను ఇంట్లో నుంచి బయటకు కదలనీయలేదు. ప్రతిచోటా పోలీసు బలగాలను ఉపయోగించారు. యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకున్నారు. దీనిపై అప్పటికప్పుడు ఆధారాలతో సహా, ఎస్ఈసీకి వినతిపత్రం అందజేసినా, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ రెండు ఉప ఎన్నికల పూర్తి వివరాలు, సమాచారం, వీడియోలు ఇవ్వాలంటూ వైఎస్సార్‌సీపీ రెండు లేఖల ద్వారా ఎస్ఈసీకి విజ్ఞప్తి చేసింది.

## మళ్లీ భారీ వర్షాలు.. ప్రజలకు కీలక సూచనలు

-మొదటిపేజీ తరువాయి

ఉందని వివరించింది. సోమవారం అంటే ఆగస్టు 16.. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# 3 పార్టీలకు పరీక్షే

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్ని పార్టీల మధ్య కాక రేపుతుంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా అన్ని పార్టీలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి నుంచే అస్త్ర శస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఉప ఎన్నికల్లో గెలిచి తమ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం చెక్కు చెదరలేదని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వంపై రెండేళ్లలోనే అసంతృప్తి పెరిగిందని, అందుకు ఉప ఎన్నికల్లో గెలిచి నిరూపించాలని బీఆర్ఎస్ పార్టీ తహతహలాడుతుంది. మరొకవైపు బీజేపీ కూడా తాము రేసులో ఉన్నామని, ఈ సారి అధికార పీఠం తమదేనని తేల్చి చెప్పేందుకు ఈ ఎన్నికను రెఫరెండంగా చూడాలని కమలనాధులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఇప్పటికే అభ్యర్థి విషయంలో స్పష్టత ఇచ్చింది. లోకల్స్ ను మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగానే ప్రకటించారు. అంటే ఇతర నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇక్కడ పోటీ చేయాలన్న ఆశలు పెట్టుకోవద్దని కూడా సున్నితంగా తెలిపినట్లయింది. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ తీవ్రంగానే ఢిల్లీలో తనకున్న లాబీయింగ్ తో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అజారుద్దీన్ ను అభ్యర్థిగా ఎంపిక చేయడం స్థానిక రాష్ట్ర నాయకత్వానికి ఇష్టం లేనట్లు కనిపిస్తుంది. అజారుద్దీన్ ప్రజలకు అందుబాటులో ఉండే నేత కాదని, అందుకే ప్రత్యామ్నాయం వైపు హస్తం పార్టీ చూస్తున్నట్లు సమాచారం. మరి హైకమాండ్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.. మరొక వైపు బీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తుంది. తమ సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి నిలుపుకుని కేసీఆర్ కు ఉన్న ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదని, అదే సమయంలో రేవంత్ సర్కార్ పై వ్యతిరేకత ప్రారంభమయిందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతల్లోనూ, క్యాడర్ లోనూ జోష్ నింపాలంటే ఈ ఎన్నికలో గెలవడం ముఖ్యమని భావిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కూడా ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో కీలక నేతలతో భేటీ అయ్యారు. కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి తదితరులతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. అయితే ఇద్దరు ముగ్గురు అభ్యర్థుల పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారని, సర్వేచేయించిన అనంతరం వారిలో ఒకరికి కేటాయిస్తారని అంటున్నారు. ఇక బీజేపీ కూడా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై నమ్మకం పెట్టుకుంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓటుబ్యాంకుతో పాటు సినీ ప్రముఖులు ఎక్కువగా ఉండటం తమకు కలసి వచ్చే అంశంగా భావిస్తుంది. అయితే టీడీపీతో పొత్తుకు మాత్రం బీజేపీ సిద్ధపడటం లేదు. టీడీపీ, జనసేనల నుంచి లోపాయికారీ పొత్తును కుదుర్చుకుని బరిలోకి దిగి గెలవాలని బీజేపీ కూడా వ్యూహాలు రచిస్తుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టిక్కెట్ కోసం అనేక మంది నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇది కూడా ఢిల్లీ స్థాయిలో తేలాల్సిన అంశం కావడంతో కొందరు కేంద్రమంత్రులు బండి సంజయ్ ద్వారా, మరికొందరు కిషన్ రెడ్డి ద్వారా, ఇంకొందరు రాజ్యసభ్యుడు కె.లక్ష్మణ్ ద్వారా లాబీయింగ్ మొదలుపెట్టినట్లు తెలిసింది. మొత్తం మీద జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక మూడు పార్టీల్లో హీట్ రేపుతుందని చెప్పాలి.



## 20 నెలలు.. 20వేల కోట్లు నెలకు 1000 కోట్ల అప్పు

-మొదటిపేజీ తరువాయి

చేసిన అప్పులపై అనేక సందర్భాలలో.. వివిధ వేదికలపై విమర్శలు చేస్తోంది.తాజాగా ఓ ప్రైవేట్ న్యూస్ ఛానల్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పుల గురించి ఒక సెటైరికల్ వీడియో రూపొందించింది. ఆ వీడియోను భారత రాష్ట్ర సమితి ఐటి విభాగంలో పనిచేసే ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దానిని భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.. కాంగ్రెస్ పార్టీ పెద్దల మీద ఒక్క మాట కూడా మాట్లాడకుండానే.. ఈ వీడియో ద్వారా తన మనసులో ఉన్న మాటను మరోసారి కేటీఆర్ బయట పెట్టారు. ,"భారత రాష్ట్ర సమితి అంత గొప్పగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తే.. ఉద్యోగులకు ఏరియర్స్ ఎందుకు చెల్లించలేదు.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు చెల్లించలేదు.. ఆరోగ్యశ్రీ బకాయిలు ఎందుకు అంతలా పెరిగిపోయాయి.. చివరికి ఔటర్ రింగ్ రోడ్డు ను కూడా తాకట్టు పెట్టారు కదా.. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఆర్థిక క్రమశిక్షణ అంత గొప్పగా ఉంటే ఇవన్నీ ఎందుకు జరిగాయని" కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

## ఆధ్యాత్మికతతో సామాజిక పరివర్తన




**కుప్పం,చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు 16:** ఆధ్యాత్మికతతో సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని సిద్ధాంతం ప్రమోద సేవ సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 21 నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మనిస్తుంది ఆహ్వానం మేరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా సమాజంలో చెడు తొలగించి మంచిని మనుషుల్లో సత్ప్రవర్తనను ప్రోత్సహించ డానికి శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ఆత్మదిగా వేడుకలు ఎంతో ఉపయోగపడతాయని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కుప్పం పట్నం ప్యాలెస్ రోడ్ లో జమీందార్ బంగారు ఈనెల 16 నుంచి 21 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు చివరి రోజున శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు జరుగు తుందని భక్తులు ఇవేడుకలు పాల్గొనాలని స్వామివారి కృపాను పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవ సమితి ఇందు జ్ఞాన సభ్యులు ప్రకాష్, కృష్ణారెడ్డి శరవన, రాజ్ కుమార్, కృష్ణమూర్తి, ఇందిరా, లక్ష్మీ, పూజ, మైత్రి ,కొత్తపల్లి బేకరీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

## జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...

**గుంటూరు :** వైసీపీ అధినేత జగన్ మైండ్ గేమ్ మొదలుపెట్టినట్లే కనపడుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బీజేపీని దూరం చేయడానికి అవసరమైన విధంగా ఆయన అడుగులు పడుతున్నట్లే ఉంది. సాధారణంగా పోలింగ్ లో తేడాలుంటే ఎన్నికల కమిషన్, బీజేపీపై జగన్ విమర్శలు చేయాల్సి ఉంది. అయితేవాటిని పక్కనపెడుతూ ఓటు చోరీ పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీపై ఆయన మండిపడుతుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఎందుకంటేరాహుల్ గాంధీ బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు కానీ, ఆంధ్రప్రదేశ్ లో 12.5 శాతం పోలింగ్ ఓట్లతో తేడా వచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకపోవడాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇందుకు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరించాని కూడా అన్నారు. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు రాహుల్ తో టచ్ లో ఉన్నారంటూ జగన్ చేసిన ప్రయత్నం రాజకీయంగా మైండ్ గేమ్ అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ లు రానున్న ఎన్నికల్లో తలపడుతున్న సందర్భంలో మరొకసారి చంద్రబాబుతో బీజేపీ చేతులు కలపకుండా చేయకుండా ఉండేదుకు ఈ రకమైన ఆరోపణలు చేస్తున్నట్లు టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ పై కడా జగన్ విమర్శలు చేశారు.. మాణికం ఠాకూర్ చంద్రబాబు నాయుడును విమర్శించడం లేదని, ఆయన ప్రభుత్వంలో జరిగే అవినీతిని ఎత్తి చూపడం లేదని, ఏపీలో అధికారంలో ఉన్న పార్టీని వదిలేసి ప్రతిపక్షంలో ఉన్న తమపై విమర్శలు చేయడమంటే లోపాయి కారీ ఒప్పందం ఏమిటో అర్థమవుతుందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం రాజకీయ ఎత్తుగడల్లో ఒక భాగమేనంటున్నారు.

# కోళ్లఫారంలో వలసకార్మికుడి మృతి



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు16:**
కోళ్లఫారంలో వలస కార్మికుడు ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కాగాతి పంచాయతీ సమీపంలో ఓ ప్రైవేటు కోళ్ల ఫారం ఉంది, ఆ కోళ్ల ఫారంలో గత మూడు సంవత్సరాలుగా చత్తీస్గడ్‌కు చెందిన నంద కుమార్ యాదవ్ 35 అనే వలస కార్మికుడు పనిచేస్తున్నాడు, శనివారం మూర్ఛవ్యాధి రావటం రావడంతో కోళ్లఫారంలో పనిచేస్తున్న కూలీలు అతన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

# గొర్రెల మంద పై చిరుత దాడి

## కనిపించకుండా పోయిన ఏడు గొర్రెలు





**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్టు16:**
గొర్రెలమందపై చిరుత దాడి చేసి ఏడు గొర్రెలుకనిపించకుండా పోయిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. పంచాయతీ కేంద్రమైన ఆమెని గుంటకు చెందిన సుధాకర్ సయ్యద్ భాషలు సమీపంలోని అంకాలమ్మ కొండకు తమ గొర్రెలమందను తరలించారు. కొండ పైకి ఎక్కు తూగొర్రెలు మేస్తుండగా ఒక్క సారిగా చిరుత వాటిపై దాడి చేసింది. ఈ దాడిలో ఓ గొర్రెలనుకాపరిఅయిన సునీల్ కాపాడడంతో మరో ఏడు గొర్రెలు కనిపిం చకుండా పోయాయి, గత రెండు నెలలుగా చిరుత సంచారం ఉన్నప్పటికీ అధికా రులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత సమయంలో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నామని ఇలాంటి పరిస్థితుల్లో చిరుత తమ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని ఇకనైనా సంబంధిత అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని,చిరుత నుంచి తమ పశు పాడి గొర్రెల సంపదను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# హరోం హర నామస్మరణతో మార్మోగిన షణ్ముఖ సుబ్రమణ్య స్వామి ఆలయం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు16:**
స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లిదేవసేన సమేత శ్రీషణ్ముఖ స్వామి ఆలయం హరోం హర నామస్మరణతో మార్మోగింది. మండల వ్యాప్తంగా భక్తులు కృతిక కావిల్లు తీసు కొని వచ్చి షణ్ముఖ సుబ్రమణ్యస్వామి ఆలయంలో చెల్లించుకున్నారు. పురవీధులలో భక్తిశ్రద్ధలతో కావిళ్లను భుజంపై ఉంచుకొని ప్రదర్శనగా ఆలయం వద్దకు వచ్చారు. అదే విధంగా శరీరానికి స్వామి వారి సూలాలు గుచ్చుకొని భక్తి పరవంతో మొక్కులు చెల్లించు కున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఆలయానికి భక్తులు చేరుకోవడంతో ఆలయం కీకిరిసి పోయింది. ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు మహేశ్వరస్వామి కుమారస్వామిలు శ్రీవల్లి దేవసేనశ్రీ షణ్ముఖస్వామికి విశేష పూజలు అలంకరణ నిర్వహించారు. ఆలయ అధికారులు అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

# చౌడేపల్లిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగష్టు 16:**
చౌడేపల్లి మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.శ్రీరుక్మిణి సత్యభామ సమేతవేణుగోపాల స్వామికి ఆలయ అర్చకుడు వశిష్టచార్యులు ఉదయాన్నే విశేషఅభిషేకాలు అలంకరణ నిర్వహించారు. పట్టణం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పట్టణ పెద్దల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరిగాయి, ముఖ్యంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాన్ని శేష వాహనంపై ఉంచి ఘనంగా ఊరే గించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

# వై.యస్.ఆర్.సి.పి. రాష్ట్ర యూత్ కార్యదర్శిగా రాహుల్ చక్రవర్తి రెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 16:**
అన్నమయ్యజిల్లా పీలేరు వైఎస్ ఆర్సిపి రాష్ట్ర యూత్ కార్యదర్శిగా ఎన్నికైన రాహుల్ చక్రవర్తి రెడ్డి మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన ఈ బాధ్యతను శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ జిల్లా యూత్ ఉపాధ్యకుడు పెద్దిరెడ్డి ద్వారక నాథ రెడ్డి, గిరీష్ రెడ్డి, వినీష్ రెడ్డి, హేమంత్ రెడ్డి, చినేపల్లి రవిచంద్ర రెడ్డి, భారత్ నాయుడు పాల్గొన్నారు.

# సిర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో వ్రాతపుస్తకాలు అభ్యసనా పంపిణీ




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు16 :**
రేణిగుంట మండలంలోని గురవరాజు పల్లి ఎస్టీ కాలనీ మరియు నీలాద్రి కాలనీ లో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దూరమేన్ వారి ఆర్థిక సహకారం తో 80 మంది పిల్లలకు అభ్యసన సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిధిగా విచ్చేసిన రేణిగుంట సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ గ్రామంలోని బడికి సక్రమంగా వెళ్లని పిల్లలు,బడి మానేసిన పిల్లలను గుర్తించగా వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది అని తెలిపారు.పిల్లలందరూ బాగా చదువుకోవడం కొరకు ఇటువంటి సిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఎంతగానో సహకారం అందిస్తుదని ఈ సదవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని ప్రతి ఒక్కరు కూడా సిర్డ్స్ సంస్థ వారు నిర్వహించే సాయంత్రం పూట టూషన్స్ కు కూడా హాజరవుతూ తమ అభ్యసన సామర్థ్యాలను పెంచుకొని చదువులో ముందంజలో ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట శిక్షణా సబ్ ఇన్స్పెక్టర్ స్వాతి మాట్లాడుతూ తల్లిదండ్రులు చదువుకోకపోయినా పిల్లల్ని చదివించాలని పిల్లలకు ఆస్థి ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ విద్యను మాత్రం అందించాలని అప్పుడే వాళ్ళు ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు.14 సంవత్సరాల లోపు పిల్లలందరూ కూడా పనికి కాకుండా బడికి వెళ్లాలని తెలిపారు. అలాగే మీ చుట్టూ పక్కల ఉన్న ప్రాంతాని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యంగా ఉండాలని అలాగే సిర్డ్స్ సంస్థ ఏర్పాటు చేసినటువంటి ఈ సాయంకాలం బడులకి పిల్లలందరూ కూడా సద్విని చేసుకొని మంచి అలవాట్లు నేర్చుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఈ కార్యక్రమంలో రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా డైరెక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ సిర్డ్స్ సంస్థ ద్వారా సాయంకాలం బడులు ఏర్పాటు చేసి విద్యను అందించడం చాలా అభినందనీయం అని తెలిపారు. సిర్డ్స్ సంస్థ వ్యవస్థాపకులు మరుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు విద్యాహక్కు చట్టం గురించి వివరిస్తూ ప్రతి బిడ్డ చదువుకోవాలని బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని 6 నుండి 14 సంవత్సరాల పిల్లల చదువు కొరకు ప్రభుత్వము అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అవకాశాన్ని ఉపయోగించుకొని అందరూ చదువుకోవాలని తెలియజేశారు.గ్రామంలోని పిల్లలందరికీ దాదాపు 80 మంది పిల్లలకు రాతపుస్తకాలు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గురువారాజు పల్లి మహిళా పోలీస్ తేజశ్వని, సిర్డ్స్ సంస్థ కో ఆర్డినేటర్ తేజోవతి,టీచర్స్, రేఖా, స్వాతి, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొనడం జరిగింది.

# అమరావతి కాలనీలోవిద్యుత్ సమస్యను తీర్చిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్ట్ 16:**
కుప్పం మున్సిపాలిటీ 9వ వార్డు అమరావతి కాలనీలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలమేరకు సుమారు 100 విద్యుత్ స్తంభాలువేయడం, విద్యుత్బలుపులు వేసి ప్రభుత్వ విప్ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతలమీదుగా వెలిగించ దంజరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు రాజకుమార్,మున్సి పల్ చైర్మన్ సెలవు రాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము,జనసేన కన్వీనర్ నరేష్, కౌన్సిలర్లు,జాకీర్, వేలు, 9వ వార్డు అభ్యర్థి, నాగభూషణం క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, సత్యేంద్ర శేఖర్, టిడిపి నాయకులు ఎక్స్ సర్పంచ్ మనీ, తిరుమగళ్, అల్లా బకాష్ నాగభూషణం గని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వెదురారణ్యం పార్కు"ను ప్రారంభించిన

## ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 16:**
చిత్తూరు, వేలూరు రోడ్డు, కలెక్టరేట్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన "వెదురారణ్యం పార్కు" ను ప్రారంభించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏ.ఎస్. మనోహర్,చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత,నూతనంగా తీర్చిదిద్దిన వెదురారణ్యం పార్కు" పరిసరాలను పరిశీలించిన ఎంపీ ,ఎమ్మెల్యేలు...వెదురారణ్యం పార్కు"లో పచ్చదనాన్ని పెంపొందించడం కోసం మొక్కలు నాటిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు.

# గుడివంకలో ఆడికృతిక ఉత్సవాలు

**గుడిపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు16:**
కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం గుడివంక కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత



శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడికృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వ హించారు. మండల టీడీపీ అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వీపుకు కొక్కీలు తగిలించుకుని క్రేన్‌కు వేలాడుతూ వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు..ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# సంపాదకీయం

# పారదర్శకతకు 'సుప్రీం' పట్టం

ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు ప్రత్యామ్నాయం ఏమీ ఉండదని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)కి సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతోనైనా అర్థమై ఉండాలి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఆ సంఘం ఆదరా బాదరాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా సవరణ మొదలెట్టింది. ఎందరు ఎన్ని అభ్యంతరాలు చెబుతున్నా బేఖాతరు చేసింది. అసలు ఈ సవరణ తీరే వేరు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేసుకోవటం, జాబితాలో అప్పటికే ఉన్నవారిని సరిపోల్చుకోవటం, చిరునామాలో లేనివారిని తొలగించటం సాగిపోయేది. కానీ ఇప్పుడు ఆఖరుసారి ఓటర్ల జాబితా పూర్తి స్థాయి సవరణ జరిగిన 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జాబితాల్లోకి ఎక్కిన వారిని ఈసీ సంశయ ఓటర్లుగా పరిగణిస్తోంది. వారినుంచి రకరకాల ధ్రువపత్రాలు అడుగుతోంది. ఇవన్నీ 1955 నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సీ)లో నిర్దేశించిన పత్రాలు. సారాంశంలో ఈ ఓటర్లంతా ముందుగా దేశ పౌరులమని నిరూపించుకోవాలి. తమ పుట్టుకకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతోపాటు తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి. ఆధార్, గతంలో ఈసీయే జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డు కూడా పనికిరాదట. పనికొచ్చే పత్రాల్లో పాస్‌పోర్టు ఉంది. కానీ ఆ పాస్‌పోర్టు సాధించటానికి పౌరులు ఆధార్ కార్డే చూపుతారని ఈసీ మరిచింది. ఒకపక్కఆందోళనలు సాగుతుండగానే సాగిన ఈ 'సర్' ప్రక్రియ తర్వాత ప్రకటించిన ఓటర్ల జాబితా ముసాయిదాలో ఏకంగా 65 లక్షలమంది పేర్లు గల్లంతయ్యాయి. 22 లక్షలమంది మరణించారని తేలిందని, రెండు చోట్ల ఓటుహక్కున్నవారు 7 లక్షల మంది కాగా, వలస పోవటం వల్లనో, ఇతర కారణాల వల్లనో 35 లక్షలమంది జాడలేదని అంటున్నది. అలాంటివారి పేర్లు తొలగించామని చెబుతోంది. నోటీసు లిచ్చి, వాదనలు విని తొలగించామంటోంది. నిరుడు జూలై నుంచి డిసెంబర్ వరకూ ఓటర్ల జాబితాలను సరిచూసి, అవసరమైన సవరణలు చేసి ఈ ఏడాది జనవరిలో ఈసీ తుది జాబితా ప్రకటించింది. అందులో 7.90 కోట్లమంది ఓటర్లుండగా, తాజా ముసా యిదాలో 7.24 కోట్ల మంది పేర్లున్నాయి. ఈ ఆర్నెల్లలో 22 లక్షల మరణాలు, మరో 35 లక్షల మంది వలసలు లేదా ఆచూకీ లేకపోవటం మాయాజాలం అనిపించటం లేదా? పైగా ఈసారి కేవలం నెల్లాళ్ల వ్యవధిలో... అంటే జూన్ 24న మొదలై జూలై 25 వరకే ఈ ప్రక్రియ సాగింది. ఇంత తక్కువ వ్యవధిలో ఇన్ని కోట్లమంది అర్హతల్ని తేల్చిపారేయటం ఎలా సాధ్యమైందన్న సంశయాలు చాలామందికొచ్చాయి. ఈ విషయంలో నిందలు పడుతున్నా ఈసీ గంభీర వదనంతో 'మీ దగ్గర ఆధారాలున్నాయా?' అని ఎదురు ప్రశ్నించటం మరిన్ని సంశయాలకు దారి తీసింది. ఇది ఈసీకీ, ఆరోపణలు చేస్తున్న నేతలకూ మధ్య పంచాయతీ కాదు. ఆ ఆరోపణలు అవాస్తమని రుజువు చేస్తే ఈసీ విశ్వసనీయతే పెరుగుతుంది. లేనట్టయితే విపక్షాలు చేసే 'ఓట్ చోరీ' ఆరోపణను జనం నమ్ముతారు. సుప్రీంకోర్టు గురువారం చెప్పింది కూడా ఇదే! తొలగించినవారి పేర్ల ఎదురుగా కారణమేమిటో పేర్కొంటూ జాబితా విడుదల చేయాలనీ, పేరు లేదా ఓటర్ క్రమ సంఖ్య టైప్ చేయగానే వివరాలు కనబడేలా ఆ జాబితా ఉండాలనీ ధర్మాసనం ఆదే శించింది. నిజానికి 'ఓట్ చోరీ' ఆరోపణ రాకముందు అలాంటి సదుపాయం ఉంది. అటు తర్వాత మాయమైందంటే ఏమనుకోవాలి? ఈ వివరాలతో పార్టీలకు జాబితా అందించామన్న ఈసీ వాదనలో పస లేదు. ఓటుహక్కు కోల్పోయినవారు కారణం తెలుసుకోవటానికి పార్టీల చుట్టూ తిరగాలా? జాబితా వెల్లడైతే ఓటర్ల గోప్యత హక్కుకు విఘాతం కలుగుతుందన్న సాకు అర్థరహితం. చనిపోయినవారి, ఆచూకీ లేనివారి హక్కులకై ఈసీకి ఎందుకంత తాపత్రయం? 'సర్' వల్ల ఎలాంటి పర్యవసానాలుంటాయో ఆ సంస్థకు అర్థమైనట్టు లేదు. బిహార్‌లోని 40 లోక్‌సభ స్థానాల్లో ఒక మీడియా సంస్థ తాజా ముసాయిదా ఆధారంగా విశ్లేషించగా దిగ్భ్రాంతి కరమైన అంశాలు వెల్లడయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 24 చోట్ల నెగ్గినవారి మెజారిటీ కన్నా ఇప్పుడు తొలగించిన ఓటర్ల సంఖ్య అధికం! ఉదాహరణకు బెగుసరాయ్‌లో విజేత మెజారిటీ 81,480. కానీ అక్కడ తొలగించిన ఓటర్లు 1,23,178 మంది. షోహర్ స్థానంలో తొలగించిన వారు 1,09,723 అయితే, ఆ ఎన్నికల్లో విజేత మెజారిటీ 29,143! ఏ ఎన్నికల్లోనైనా అధిక ధరలు, నిరుద్యోగం వంటివి చర్చకొస్తాయి. ఈసీ నిర్వాకంతో రాగల బిహార్ ఎన్నికల్లో ఓటర్ల జాబితా తిరకాసే ప్రధాన అంశం కాబోతోంది. ఇది ఎన్డీయే కూటమికి మంచి పరిణామమైతే కాదు. ఓటర్ల జాబితాలో పేరు తొలగించటమంటే పోటీ చేయటానికి గల హక్కును నిరాకరించటం కూడా. ఇది బిహార్‌తో ఆగదు. ఎన్నికలు జరగనున్న కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళ నాడులకు కూడా విస్తరిస్తుంది. ఇంత అస్తవ్యస్తంగా, ఇంత గోప్యంగా ఉండే ప్రక్రియ ద్వారా ఇంతకూ ఈసీ సాధించదల్చుకున్నదేమిటి?

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143